క్లుప్తంగా

ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వద్దు

వాటర్ సంస్థ ప్రతినిధి కృష్ణ



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వాటర్ సంస్థ ప్రతినిధులు, మహిళలు

మంచాల: మహిళలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని వాటర్ సంస్థ ప్రతినిధి కృష్ణ అన్నారు. బుధవారం మంచాల మండల పరిధిలోని బండలేమూర్ గ్రామంలో వాటర్ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఆరోగ్యం పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పని ఒత్తిడి వంటి కారణాలతో మహిళలు ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారని అది ఎంత మాత్రం కరెక్టు కాదన్నారు. ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా మహిళలు ఆరోగ్యం పట్ల అప్రమతంగా ఉండాలన్నారు. ఏఎస్ఎంలు, ఆశ వర్కర్లు, మహిళలు పాల్గొన్నారు.

ప్రజాగర్జన వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నేతలు

ఇబ్రహీంపట్నం: సీపీఐ ప్రజా పోరుబాట యాత్ర (ప్రజాగర్జన) ముగింపు సభ వాల్‌పోస్టర్‌ను బుధవారం ఇబ్రహీంపట్నంలో ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. కొత్తగూడెంలో జరిగే బహిరంగసభతో ఈ యాత్ర రాష్ట్రంలో ముగుస్తుందని నేతలు తెలిపారు. సీపీఐ నాయకులు యాదయ్య, రాజునాయక్, అలీమొద్దీన్, అనంతరెడ్డి, విజయకుమార్, నర్సింహ, యాదయ్య పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ మంగమ్మ

తుర్కయంజాల్: దశలవారీగా వార్డు అభివృద్ధికి కృషి చేస్తున్నామని కౌన్సిలర్ కొత్తకుర్మ మంగమ్మ అన్నారు. బుధవారం తుర్కయంజాల్‌లోని లక్ష్మీగార్డెన్స్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొత్తకుర్మ శివకుమార్, కాలనీవాసులు నరేందర్ రెడ్డి, భాస్కర్‌రావు, రమేష్, మధునూరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

అబ్దుల్లాపూర్‌మెట్: రెండో విడత గొర్రెల పంపిణీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అబ్దుల్లాపూర్‌మెట్ మండల పశువైద్యాధికారి నర్సింహరావు సూచించారు. మండలంలోని మజీద్‌పూర్ గ్రామంలో బుధవారం గొర్రెల పంపిణీ పథకంపై యాదవ సంఘాలకు సర్పంచ్ పోచంపల్లి సుధాకర్‌రెడ్డితో కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండో విడత పథకంలో భాగంగా గ్రామానికి చెందిన 59 మంది అర్హులను గుర్తించినట్లు పేర్కొన్నారు. ఎంపికైన లబ్ధిదారులు కుల ధృవీకరణ పత్రాలు, బ్యాంక్ పాసు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్, పాస్ పోర్టు సైజు ఫొటోలను తమకు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యాదవ, కురుమసంఘం సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించండి: సీపీఎం



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

కందుకూరు: అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని సీపీఎం నాయకులు బుధవారం ఆర్డీఓ సూరజ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు డీ రాంచందర్, మండల కార్యదర్శి బీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. కందుకూరు రెవెన్యూ సర్వే నంబర్ 788లో 2007లో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించారని, పట్టా సర్టిఫికెట్లు జారీ చేసినా కబ్జా చూపలేదన్నారు. 2022 అక్టోబర్‌లో పేదలు ఆ స్థలంలో గుడిసెలు వేసుకుంటే అధికారులు తొలగించారన్నారు. సర్టిఫికెట్లు ఉన్న వారికి స్థలం చూపాలని వారు కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎ.కుమార్, బీ బాల్‌రాజు, ఆర్.శేఖర్, జి.సత్తయ్య పాల్గొన్నారు.

ఆదమరిస్తే.. అంతే సంగతి

- ప్రమాదకరంగా ఆరుట్ల-బండలేమూర్ రోడ్డు
- మలుపులు, గోతులతో రాకపోకలకు ఇబ్బంది
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



ఆరుట్ల-బండలేమూర్ రోడ్డు దుస్థితి

మంచాల: అడుగడుగునా మలుపులు... ఎక్కడికక్కడ గోతులు... ఆదమరిచామా ఇక అంతే సంగతులు. ఇది ఆరుట్ల-బండలేమూర్ రోడ్డు దుస్థితి. రంగారెడ్డి-నల్లగొండ-యాదాద్రి జిల్లాలకు బండలేమూర్ సరిహద్దు గ్రామం. ఈ గ్రామం మీదుగా అటు యాదాద్రి, ఇటు నల్లగొండ జిల్లాలకు చేరుకోవాలంటే దగ్గర ఉంటుంది. ఈ గ్రామం మీదుగానే యాదాద్రి జిల్లాలోని మునుగోడు నియోజకవర్గంలోని గట్టుప్పల్, వాయిలపల్లి, నారాయణపూరం, అంతంపేట్, కేల్ తండా, చిల్లాపూర్ తండాకు వివిధ గ్రామాల నుంచి ప్రజలు హైదరాబాద్‌కు చేరుకుంటారు. నగరానికి దగ్గరగా ఉండటంతో సిటీ ఆర్టీసీ బస్సును కూడా నడిపిస్తున్నారు. ప్రైవేట్ వాహనాలు కూడా బాగానే నడుస్తాయి.

ప్రమాకర మలుపులు, గుంతలు..

ఆరుట్ల నుంచి బండలేమూర్ గ్రామానికి 7 కిలోమీటర్ల దూరం ఉంది. నిత్యం వేలాది వాహనాలు ఈ రోడ్డుగుండా ప్రయాణం చేస్తాయి. అయితే ఈ రోడ్డు మార్గంలో ఐదు చోట్ల ప్రమాదకరమైన మలుపులు, మూడుచోట్ల పెద్ద గోతులు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఆయా గ్రామాల ప్రజలు సంబంధిత అధికారులకు, ప్రజా ప్రతినిధులకు రోడ్డు బాగుచేయాలని పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ వారు పట్టించుకోవడంలేదంటూ విమర్శలు ఉన్నాయి. రాత్రిపూట ఈ రోడ్డు మీద ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఏమాత్రం ఏమరపాటు వహించినా ప్రాణాలు గాలిలో కలిసినట్లే. ఇప్పటికైన అధికారులు ఈ రోడ్డును బాగుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



ఆరుట్ల నుంచి బండలేమూర్‌కు వెళ్లే రోడ్డు ప్రమాదకరంగా మారింది. అనేక చోట్ల మలుపులు, గోతులు ఉన్నాయి. మలుపుల వద్ద కనీసం హెచ్చరిక బోర్డులు కూడా లేవు. ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. తక్షణమే నిధులు మంజూరు చేసి మరమ్మతులు చేపట్టాలి.

– ఈశ్వర్, మాజీ సర్పంచ్, బండలేమూర్

ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం



ఆరుట్ల-బండలేమూర్ రోడ్డు మరమ్మతుల కోసం కోటి రూపాయలు మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. నిధులు రాగానే టెండర్లు పిలిచి పనులు చేయిస్తాం. అప్పటివరకు అవసరమైతే తాత్కాలిక మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేస్తాం.

– అబ్బాస్, పంచాయతీరాజ్ డీఈఈ, ఇబ్రహీంపట్నం

క్షతగాత్రులను ప్రభుత్వం ఆదుకోవాలి

మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్



క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న బూర

యాచారం: ఔటర్ రింగ్ రోడ్డుపై మొక్కలు నాటే పనులకు వెళ్తూ ప్రమాదానికి గురైన కూలీలను ప్రభుత్వం ఆదుకోవాలని భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ కోరారు. రెండు రోజుల కింద ఆదిబట్ల పోలీస్ స్టేషన్ సమీపంలో ఓ ప్రైవేట్ వాహనంలో వెళ్తూ కొత్తపల్లికి చెందిన 22 మంది ఉపాధి హామీ కూలీలు ప్రమాదానికి గురయ్యారు. వారంతా నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. క్షతగాత్రులను బుధవారం మాజీ ఎంపీ బూర పరామర్శించారు. నిత్యం రెక్కాడితేగాని డొక్కాడని పేదలు రోడ్డు ప్రమాదానికి గురై జీవనోపాధి కోల్పోయారని అన్నారు. వైద్య ఖర్చులతో పాటు వారు పూర్తి ఆరోగ్యంగా మారే వరకు ప్రభుత్వమే ఖర్చులు భరించాలని కోరారు. అంతకు ముందు టీపీసీసీ నేత దండెం రాంరెడ్డి కూడా ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన వైద్య అందించాలన్నారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు రవీందర్ ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ..

రంగారెడ్డి జిల్లా: రెండు రోజుల క్రితం ఓఆర్ఆర్ వద్ద మొక్కలు నాటేందుకు వెళ్తుండగా బోలేరో వాహనం పల్టీ కొట్టడంతో గాయపడ్డ కొత్తపల్లి గ్రామానికి చెందిన కూలీలను మంగళవారం బృంగి ఆస్పత్రిలో మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పరామర్శించారు. బుధవారం ఉదయం బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేశ్ బృంగి ఆస్పత్రి, బొంగ్లూర్‌లోని మోహన్‌రెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు.

ఆధార్ అనుసంధానం వేగవంతం చేయండి

తలకొండపల్లి: ఓటర్ కార్డుకు ఆధార్‌కార్డును అనుసంధానం చేయించాలని డీటీ సంతోష్ అన్నారు. బుధవారం మండల రెవెన్యూ కార్యాలయంలో ఆయన బీఎల్‌ఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ.. ఒకే ఇంటి నంబర్‌తో 6మంది పైచిలుకు ఓటర్లు ఉన్న ఇళ్లను గుర్తించడం జరిగిందన్నారు. ఆ ఓటర్లు అందరూ ప్రస్తుతం ఒకే ఇంటిలో నివసిస్తున్నారా లేదా అని విచారణ చేపట్టాల్సి ఉందన్నారు. మండలంలో 143 మందికి చెందిన ఇంటి నంబర్లు తప్పుగా ఉన్నాయని, అవి మార్చడానికి ఓటర్ యొక్క ఆధార్‌కార్డును తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని వెల్జాల్‌కు చెందిన జంగయ్య (58) ఇటీవల మృతిచెందాడు. ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఫౌండేషన్ సభ్యులచే బుధవారం రూ.5000 ఆర్థిక సహాయం అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు రాములు, మల్లేశ్, శ్రీను, రాఘవేందర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

కొంగరకలాన్‌లో కంటివెలుగు శిబిరం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రంగారెడ్డి జిల్లా: ఆదిబట్ల మున్సిపాలిటీలోని కొంగరకలాన్ ప్రభుత్వ పాఠశాలలో కంటివెలుగు శిబిరాన్ని మున్సిపల్ కౌన్సిలర్లు మహేందర్, శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. కంటి పరీక్షలు చేయించుకుని అవసరమున్నవారికి కళ్లద్దాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి నారాయణ, కంటివెలుగు ప్రోగ్రాం అధికారి డాక్టర్ భాగ్యలక్ష్మి, వీహెచ్ తిటుస్, ప్రణతీ, ఆశవర్కర్లు కవిత, సబిత, అంగన్‌వాడీ కార్యకర్తలు వసంత, హేమలత, సంగీత పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు

సీఐ రామకృష్ణ

ఇబ్రహీంపట్నం: సరైన సమయంలో బాల్య వివాహాన్ని అడ్డుకున్న సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నంకు చెందిన 16 సంవత్సరాల మైనర్ బాలికకు చౌటుప్పల్‌కు చెందిన వ్యక్తితో పెండ్లి నిశ్చయం చేశారు పెద్దలు. పెండ్లికి ఇంకా కొద్దిరోజుల సమయం ఉండగా ఈ విషయం చైల్డ్‌లైన్ దృష్టికి వెళ్లింది. ఈ మేరకు చైల్డ్‌లైన్ అధికారి లాజరస్, ఐసీడీఎస్ అధికారులు, స్థానిక పోలీసులు, రెవెన్యూ అధికారులు మైనర్ బాలిక తల్లిదండ్రులను పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. తమ అమ్మాయి మేజరైన అనంతరమే వివాహం చేస్తామని లిఖిత పూర్వకంగా తల్లిదండ్రులు తెలియజేసారని సీఐ చెప్పారు. ఎవరైన బాల్య వివాహాలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సీఐ రామకృష్ణ హెచ్చరించారు. బాల్యవివాహాలపై పోలీసులకు సమాచారం అందజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

ఒకే ఓటు నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లండి

- కందుకూరు ఆర్డీఓ సూరజ్‌కుమార్
- మహేశ్వరం నియోజకవర్గ ఓటరు సర్వే, ఎన్నికల నిర్వహణపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ సూరజ్‌కుమార్

మీర్‌పేట: మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ సర్వే, ఎన్నికల నిర్వహణకు సంబంధించి బుధవారం మీర్‌పేట కార్పొరేషన్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు, బీఎల్‌ఓలుపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. కందుకూరు ఆర్డీఓ సూరజ్‌కుమార్ హాజరై మాట్లాడారు. బీఎల్‌ఓలు స్థానిక రాజకీయ నాయకులతో సమన్వయం చేసుకుని ఇంటింట ఓటరు సర్వే చేసి, ఒక వ్యక్తికి ఒకే ఓటు అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. మరణించిన వారి ధ్రువీకరణ పత్రం తీసుకొని జాబితా నుంచి తొలగించాలని ఆదేశించారు. అదే విధంగా ఒకే ఇంటి నంబర్‌పై 6 లేదా అంతకంటే ఎక్కువ ఓటర్లు ఉంటే వాళ్ల జాబితాను పునః పరిశీలించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఓ ఎన్నికల అధికారిగా రానున్న ఎన్నికలు సజావుగా జరిగేందుకు తోడ్పడాలని ఆర్‌డీఓ విజ్ఞప్తి చేశారు. అదే విధంగా ఓటర్ రీ వెరిఫికేషన్ జరుగుతున్న విధానం గురించి ఆర్‌డీఓ రాజకీయ పార్టీల నాయకులకు వివరించారు. దీంతో పాటు నాయకులు ఇచ్చిన సలహాలు, సూచనలను స్వీకరించి తగు చర్యలు చేపడతామని ఆయన తెలిపారు. బాలాపూర్ మండల తహసీల్దార్ జనార్దన్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ఆదిత్య, మేయర్ ఎం దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, రాజకీయ పార్టీల నాయకులు పీ జంగయ్యగౌడ్, పీ నర్సింహ, జీ శ్రీనివాస్, డీ భూపేష్‌గౌడ్, కమిషనర్ సీహెచ్ నాగేశ్వర్, మేనేజర్ వెంకట్‌రెడ్డి, ఎన్నికల అధికారి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మానవ తప్పిదాలతోనే ప్రకృతి వైపరీత్యాలు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

మీర్‌పేట: భారతీయ సంస్కృతి అతి పురాతనమైనదని, నా దేశం.. నా సంస్కృతి అనే భావన నేటి తరం పిల్లల్లో కలిగించాలని సిల్వర్ డ్రాప్స్ పాఠశాలల చైర్మన్ శ్రీనివాసరావు తల్లిదండ్రులకు సూచించారు. వికాస తరంగిణి ఆధ్వర్యంలో జిల్లెలగూడ సిల్వర్ డ్రాప్స్ పాఠశాలలో 10రోజుల పాటు జరిగిన వేసవి శిక్షణ శిబిరం బుధవారంతో ముగిసింది. ముఖ్యఅతిథులుగా శ్రీనివాసరావు, ప్రముఖ ప్రవచన కర్త వేముల రాజేశ్వరరావు హాజరై మాట్లాడారు. మానవ తప్పిదాల వల్లే ప్రకృతి వైపరీత్యాలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఏది మంచి, ఏది చెడు అని గ్రహించే జ్ఞానం మనిషికి మాత్రమే ఉంటుందన్నారు. మంచి గుణాలు ఉన్నవాడే మానవుడు అవుతాడని అన్నారు. విద్య అనేది పిల్లలకు మనం ఇచ్చే అతి పెద్ద ఆస్తి అని పేర్కొన్నారు. భగవద్గీతను ప్రతి ఒక్క విద్యార్థి నేర్చుకోవాలని సూచించారు. అనంతరం నిర్వాహకులు రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. శిక్షణ తరగతుల్లో పిల్లలకు ఆటపాటలు, శ్లోకాలు, భజనలు, కీర్తనలు, యోగా, విద్యతో పాటు విలువలతో కూడిన విషయాలను నేర్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వికాస తరంగిణి జోనల్ బాధ్యులు అహల్య, విద్యుత్ శాఖ అధికారి రమణ, అప్పం రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

మండుటెండలో పనులు చేయొద్దు

- ఉదయం 6 గంటలకే రావాలి
- ఉపాధి పనులను పరిశీలించిన అధికారులు



ఇబ్రహీంపట్నం: ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న అధికారులు

ఇబ్రహీంపట్నం: ఉపాధీ హామీ పనులకు కూలీలు ఉదయం 6 గంటలకే వచ్చి తొందరగా ముగించుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ క్రాంతికిరణ్ సూచించారు. బుధవారం రాయపోల్ గ్రామంలో క్షేత్రస్థాయిలో ఉపాధి పనుల తీరును ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. మండుటెండల్లో పనులు చేయవద్దన్నారు. పని ప్రదేశంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచామని చెప్పారు. తనతోపాటు ఏపీఓ, ఈసీ తదితర అధికారులు ఉపాధి పనులను పరిశీలించి కొలతలపై కూలీలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. బ్యాంకుకు ఆధార్‌కార్డు లింకు చేయని కారణంగా, ఒకే కూలీకి రెండు నుంచి మూడు ఖాతాలు ఉండటం వలన వారికి డబ్బుల చెల్లింపులు జరిగినా తెలియడంలేదన్నారు. ఆధార్ లింకు ఉన్న ఖాతాల్లో ఉపాధి కూలీ డబ్బులు పడుతున్నట్లు గమనించాలన్నారు. అనంతరం ముకునూర్ గ్రామ పంచాయతీలో ఉపాధి కూలీలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ అడిషనల్ ప్రోగ్రాం అధికారి తిరపతిచారి, టెక్నికల్ అసిస్టెంట్ రవి, సర్పంచ్ బల్వంత్‌రెడ్డి, జ్యోతి పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..

ఆమనగల్లు: ఉపాధి హామీ పథకంలో భాగంగా ఎక్కువ మంది కూలీలకు పని కల్పించాలని ఆమనగల్లు ఎంపీడీఓ ఫారూక్ హుస్సేన్ తెలిపారు. బుధవారం మండలంలోని శంకరకొండతండాలో కొనసాగుతున్న ఈజీఎస్ పనులను పనులను ఆయన పరిశీలించారు. అనంతరం నర్సరీని, తండాలో చేపట్టిన పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఉపాధి పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను విధిగా చేపట్టాలని, ప్రతి ఇంటికి మరుగుదొడ్డి, ఇంకుడు గుంత ఉండేలా చూడాలని ఆయన సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ లచ్చి, ఉపసర్పంచ్ ప్రశాంత్‌నాయక్, స్థానిక నాయకులు పత్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



బీమా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

రంగారెడ్డి జిల్లా: కార్యకర్తలకు సభ్యత్వమే శ్రీరామరక్ష అని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండలం ఉప్పరిగూడకు చెందిన షేక్ రహీం ఇదివరకు బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం తీసుకున్నాడు. ప్రమాదవశాత్తు ఇటీవల రహీం మరణించాడు. దీంతో పార్టీ తరుపున ప్రమాద బీమా రూ.2 లక్షలు మంజూరయ్యాయి. బీమా చెక్కును బుధవారం ఇబ్రహీంపట్నం మండలంలోని ఎల్మినేడు గ్రామంలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా రహీం భార్య గౌసియాకు అందజేశారు. కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. ఎంపీపీ కృపేష్, జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రాంరెడ్డి, ఉపసర్పంచ్ నర్సింహారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు గోపాల్, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం

బీఆర్ఎస్ సీనియర్ నేత శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ప్రజలందరూ ఘనంగా జరుపుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గోలి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఆమనగల్లు పట్టణంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ప్రజల కలలను ముఖ్యమంత్రి కేసీఆర్ నిజం చేసి చూపిస్తున్నారన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. రాష్ట్రంలో విద్య, వైద్య, ఆరోగ్య రంగంలో అనేక మార్పులు తీసుకువచ్చి ప్రజలకు సేవలు అందిస్తున్నారని చెప్పారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతు బీమా పథకాలు అందిస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. రాష్ట్రంలో మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం రావడం ఖాయమన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటుతామన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు జహంగీర్, నాగులునాయక్, చంద్రశేఖర్‌రెడ్డి, తిరుపతి, సతీష్, సుమన్‌నాయక్, శేఖర్, గోపి, శివ తదితరులు పాల్గొన్నారు.

పరిహారం ఇవ్వకుంటే ఆందోళన ఉధృతం



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న బాధితులు, సీపీఎం నాయకులు

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట వడగళ్ల బాధితుల ధర్నా
- మద్దతు తెలిపిన సీపీఎం నాయకులు

యాచారం: వడగళ్లతో పంటలు, రేకుల ఇళ్లకు రంధ్రాలు పడి తీవ్రంగా నష్టోయిన మంతన్‌గౌరెల్లి గ్రామస్తులు బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రెండు నెలల కింద మంతన్‌గౌరెల్లి గ్రామంలో వడగళ్లు కురిసి 600 వరకు రేకుల ఇళ్లు రంధ్రాలు పడి ధ్వంసం కాగా.. 200 ఎకరాలకు పైగా వరి, పండ్లు, కూరగాయల పంటలకు తీవ్రం నష్టం జరిగింది. దాదాపు రూ.5 కోట్లకు పైగానే నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. రెండు నెలలు గడిచినా పరిహారం ఇవ్వకపోవడంతో బుధవారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో గ్రామస్తులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీఎం కేసీఆర్ వడగళ్ల వల్ల నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.10 వేలు ఇస్తామని హామీ ఇచ్చి నెలలు గడుస్తున్నా హామీ అమలు కాకపోవడం దారుణమని అన్నారు. వడగళ్ల బాధితులకు పరిహారం ఇవ్వకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ, మండల కమిటీ సభ్యులు తావునాయక్, చందునాయక్ అన్నారు. సీఎం హామీ ఇచ్చినా కూడా ఇంతవరకు పరిహారం అందించకపోవడం వెనుక ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఉప తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు అందజేశారు.

సమన్వయంతో పనిచేయండి

ఎంపీపీ కొప్పు సుకన్య

యాచారం: మండలంలోని ప్రతి గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని ఎంపీపీ కొప్పు సుకన్య అన్నారు. మండల పరిధిలోని చౌదర్‌పల్లిలో బుధవారం రూ.7 లక్షల నిధులతో వివిధ అభివృద్ధి పనులకు ఆమె భూమిపూజ నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలన్నారు. మంజూరైన నిధుల ద్వారా సకాలంలో పనులు పూర్తిచేసేలా చూడాలని సూచించారు. చేసే పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. గడువులోపు పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో శరవేగంగా అభివృద్ధి పనులను చేపడుతున్నామన్నారు. ప్రజలు అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, సర్పంచ్ నర్సింహారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు రాజేందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ నర్సింహ, పంచాయతీ రాజ్ ఏఈ సల్మాన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ సుకన్య